క్లుప్తంగా

లబ్ధిదారులకు ఆస్తిహక్కు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు ఆస్తిహక్కు పత్రాలు అందజేస్తున్న ఈవోపీఆర్డీ మోహన్

ఓజిలి: మండలంలోని తిరుమలపూడి గ్రామంలో సోమవారం జగనన్న భూరక్ష–భూహక్కు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలను ఈవోపీఆర్డీ మోహన్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో గ్రామకంఠం భూమిలో నిర్మించుకున్న ఇళ్లు, స్థలాలకు శాశ్వత హక్కు కల్పిస్తూ 100 మందికి పత్రాలు మంజూరు చేసినట్టు తెలిపారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఆసరాగా నిలిచేందుకు భూరక్ష–భూహక్కు పథకం అమలుచేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పాదర్తి రాములనాయుడు, కార్యదర్శి పెద్ద మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ



బ్లాక్ బెల్టు సాధించిన విద్యార్థి కార్తికేయ

నాయుడుపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కార్తికేయ కరాటే పోటీలో ప్రతిభ కనబరచినట్టు హెచ్ఎం సురేష్‌బాబు తెలిపారు. వెంకటగిరిలోని వంకి పెంచలయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పోటీల్లో కార్తికేయ పాల్గొని బ్లాక్ బెల్ట్, జ్ఞాపిక అందుకున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థిని ఇన్‌చార్జి హెచ్ఎం సురేష్‌బాబు అభినందించారు.

ఆర్బీకేల్లో రైతుల జాబితాలు



రైతులతో మాట్లాడుతున్న ఏవో

సైదాపురం: సున్నా వడ్డీ, పంట రుణాలకు అర్హులైన రైతుల జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటుచేసినట్టు ఏవో హైమావతి తెలిపారు. ఆమె సోమవారం అనంతమడుగు, పాలూరు రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం సున్నా వడ్డీ, పంట రుణాలకు అర్హులైన రైతుల జాబితాలను ప్రదర్శించారు. రైతులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రబీ, ఖరీఫ్ సీజన్‌ల్లో పంట రుణాలు రూ.లక్ష లోపు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతుల ఖాతాల్లోకి 4 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. మండలంలో 150 మంది రైతులకు రూ.4,39,650 జమ చేసిందన్నారు.

చెరువులో తవ్వుతున్న జేసీబీల స్వాధీనం



పోలీసు స్టేషన్ వద్దనున్న జేసీబీలు

సైదాపురం: చెరువుతో పాటు శ్మశానం వద్ద సోమవారం తెల్లరాయిని తరలిస్తున్న రెండు జేసీబీలను రైతులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. సైదాపురం చెరువు వద్దనే శ్మశానం కూడా ఉంది. పాలూరుకు చెందిన కొందరు అక్రమార్కులు రెండు రోజుల నుంచి చెరువులో ఉన్న తెల్లరాయిని తవ్వుతున్నారు. శ్మశానాన్ని కూడా తవ్వుతుండడంతో రైతులు, వైఎస్సార్ సీపీ నేతలు అక్కడికి చేరుకున్నారు. పనులు చేస్తున్న రెండు జేసీబీలను అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సును ఢీకొన్న కారు

గూడూరు రూరల్: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు ముందున్న బస్సును ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కారులో ఉన్న నలుగురికి ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. నలుగురు వ్యక్తులు కారులో బెంగళూరు నుంచి ఏలూరు వెళుతున్నారు. కారు గూడూరు మండలంలోని జాతీయ రహదారిపై మినీ బైపాస్ వద్దకు చేరుకుంది. అక్కడ ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు కొంత నెమ్మదించడంతో వెనుక భాగంలో ఢీకొంది. అదే సమయంలో వెనుక వస్తున్న మరో బస్సు కారును ఢీకొంది. దీంతో కారు ముందు, వెనక భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులోని వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కండలేరులో 9.810 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 9.810 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 600 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 10, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేసి చూపుతాం





గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లిరామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- రాపూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం

రాపూరు : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, అభివృద్ధి చేసి చూపుతామని ఆ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన సోమవారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలిసి రాపూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, వారు పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పథకాలు అందని వారికి వెంటనే అందించేలా చూడాలని నాయకులకు సూచించారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో ప్రజల కష్టాలను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని మేనిఫెస్టోలో చేర్చి అన్నింటినీ నెరవేర్చారని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు గ్రామీణ ప్రజలకు ఎంతగానో సౌకర్యంగా మారాయని వివరించారు. పేదలకు సంక్షేమ ఫలాలు యథావిధిగా అందాలంటే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పఠాభిరామిరెడ్డి, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీనారాయణరెడ్డి, సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ గౌరి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నెల్లూరు రవీంద్రారెడ్డి, తిరుపతి జిల్లా మైనార్టీ విభాగం కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, మురళీమోహన్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, గుండురాఘవయ్య, ఆసీఫా, రమణయ్య, రమణారెడ్డి, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి తగిన గుర్తింపు



మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన సోమవారం సనత్‌నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ బూత్ కన్వీనర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వార్డుల్లో ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే గుర్తించాలన్నారు.

ప్రతి బూత్ కమిటీలో 20 మంది సభ్యులను నియమించాలని సూచించారు. చురుగ్గా ఉండే మహిళలను ఎంపిక చేసి వారికి ఓటర్ల జాబితాపై అవగాహన కల్పించాలని తెలిపారు. 12వ తేదీ నుంచి పట్టణంలోని ప్రతి వార్డులోనూ పర్యటించి అందరినీ కలుపుకుని ప్రణాళికాధ్ధంగా ముందుకు వెళతామన్నారు. ఏడవ తేదీన గూడూరు నియోజకవర్గ స్థాయి మైనార్టీ సమావేశంను నిర్వహిస్తున్నామని, ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, మగ్దూం, తాళ్లూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై శిక్షణ

చిల్లకూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై బీఎల్‌వోలకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా చాలెంజ్ ఓటు వేసే సమయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఎక్కడైనా ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే సాంకేతిక సిబ్బందికి సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అనంతరం ఈవీఎంల నమూనాను చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి రావు, డిప్యూటీ తహసీల్దార్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాలిటీలోని 25వ వార్డులో ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాలపై ఉన్న పన్ను బకాయిలు చెల్లించేందుకు ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను ఇస్తున్నట్టు కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. 2024 మార్చి 31 ముందు వరకు ఉన్న మొండి బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

వాకాడు : ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేసిన పనులపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తోట గోపీనాథ్ తెలిపారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై తనిఖీల్లో తేలిన అంశాలపై విచారణ ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

గూడూరు రూరల్ : గూడూరు నియోజకవర్గంలోని ప్రజల విద్యుత్ సమస్యలపై బుధవారం ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ నరేంద్రరెడ్డి సోమవారం తెలిపారు. ఆయన సోమవారం గూడూరు రూరల్ ప్రాంతంలోని గోగినేనిపురంలోని డీఈఈ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ శాఖ పరిధిలోని సమస్యలను అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను అరికట్టండి



వినతులు స్వీకరిస్తున్న గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు రూరల్ : చిల్లకూరు మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని ఏపీ యానాది సంఘం నాయకులు కుడుముల గోపాల్, శిరీష తెలిపారు. వారు సోమవారం గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చిల్లకూరు సచివాలయం పరిధిలోని క్రిష్టాపురంలో ఉన్న ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకున్నారని తెలిపారు. తనకు ప్రభుత్వం కేటాయించిన సీజేఎఫ్ఎస్ భూమికి హద్దులు చూపించాలని నాలుగు ఏళ్ల నుంచి తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని వెంకటగిరి మండలం పంజాం గ్రామానికి చెందిన కాళయ్య వాపోయారు. తన భూమిని రైల్వే లైన్ నిర్మాణానికి తీసుకున్నారని, పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని డక్కిలి మండలం ఆల్తూరుపాడుకు చెందిన శంకరయ్య కోరారు. తన భూమికి హద్దులు చూపించాలని బాలాయపల్లి మండలం వాక్యం గ్రామానికి చెందిన చిన్నయ్య వినతి పత్రం అందించారు. స్పందించిన ఆర్డీవో మాట్లాడుతూ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజల ముందుకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న రైతులు



ఆహార ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు



స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఏడీఏఈ గోపీనాయక్

నాయుడుపేట: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా యాంకర్ సీహెచ్ రవిచంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పురుగు మందుల వినియోగం లేని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యాలకు మేలు చేకూరనుందన్నారు. ఇందులో భాగంగానే స్టాల్స్‌ను ఏర్పా టు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ అనంతయ్య, మోడల్ మేకర్ శ్రీనివాసులు, సిబ్బంది రమణమ్మ, మల్లీశ్వరి, హేమంత్‌కుమార్, ఐసీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓజిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహార ఉత్పత్తులను తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తుల విక్రయాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పురుగు మందులు, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను వినియోగించాలని సూచించారు. ఇక్కడ కూరగాయలు తక్కువ ధరలకే విక్రయిస్తున్నట్టు చెప్పారు. మండలంలోని ఆర్మేనిపాడు, ఇనుగుంట, చిలమానుచేను, గుర్రంకొండ తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తోటలను సాగుచేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్, మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ మధు, గూడూరు డివిజన్, ఓజిలి మండల ఇన్‌చార్జ్‌లు వీరరాఘవయ్య, జైతున్‌బీ, సిబ్బంది తిరుమల, ధనుంజయ, అజిత, మహేశ్వరి, షబ్న, ప్రశాంతి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల విక్రయాలు

గూడూరు రూరల్ : గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఇకపై ప్రతి సోమవారమూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ సహాయ సంచాలకులు గోపీనాయక్ తెలిపారు. ఆయన సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో స్టాల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే క్రమంలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం కింద పంటలను కషాయాలతో పండిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో రమేష్, ఏపీఎం బుజ్జమ్మ, జిల్లా మార్కె టింగ్ ఎస్ఎఫ్ మధు, తిరుమల, చిల్లకూరు మండ ల ఇన్‌చార్జ్‌లు క్రిష్ణయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

దొరవారిసత్రం : పోలిరెడ్డిపాళెం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి బైక్ ఢీకొనడంతో మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. అక్కరపాక గ్రామానికి చెందిన కోగిలి రమణమ్మ(40) పూలతోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తోంది. పనిపై సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి సొంత గ్రామానికి చెందిన శరత్‌తో కలిసి బైక్‌లో ఇంటికి బయలుదేరింది. పోలిరెడ్డిపాళెం వద్ద వెనుక వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో రమణమ్మ, శరత్ గాయపడ్డారు. వారిని స్థానికులు సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి రమణమ్మను నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఆమె భర్త జయరామయ్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

7న మెగా జాబ్ మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో 7వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం తెలిపింది. ఈమేళాకు 13 బహుళ జాతీయ కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

తూతూమంత్రంగా టీడీపీ పరిచయ కార్యక్రమం

తడ/దొరవారిసత్రం/సూళ్లూరుపేట: ఊహించని రీతిలో టికెట్టు సాధించుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ సోమవారం తడ, దొరవారిసత్రం మండలాల నాయకులతో పరిచయం కార్యక్రమం చేపట్టారు. స్థానిక నాయకుల్లో ఒక వర్గానికి చెందిన కొద్దిమంది మాత్రమే హాజరుకావడం విశేషం. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులతోపాటు వేనాటి వర్గానికి చెందిన వారు ఒక్కరు కూడా రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. జనసేన నాయకులు కూడా రాలేదు. నెలవల సుబ్రమణ్యం పలు సందర్భాల్లో జనసేనను తక్కువ చేస్తూ మాట్లాడడంపై ఆ పార్టీ నేతలు గుర్రుగా ఉన్నారు. స్థానికంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఫొటో తప్ప నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కు చోటు కల్పించకపోవడంపై రగిలిపోతున్నారు. టీడీపీ అభ్యర్థి పరిచయ కార్యక్రమానికి ఆ పార్టీ నుంచి ఒక్కరు కూడా హాజరు కానట్టు సమాచారం. తమకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా అభ్యర్థిని ప్రకటించడంపై వేనాటి వర్గం అసంతృప్తితో ఉంది. తమకు పార్టీలో విలువ లేదని గ్రహించిన వేనాటి వర్గం వారు కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సోమవారం పరిచయ కార్యక్రమం గంగా ప్రసాద్ వర్గానికి చెందిన కొద్ది మంది, దినసరి కూలి కోసం వచ్చిన పొరుగూరు వారితో మాత్రమే నిర్వహించారు.

కంపెనీ బస్సును ఢీకొన్న కారు



దెబ్బతిన్న కారు ముందు భాగం

తడ: జాతీయ రహదారిలోని పాత మాంబట్టు రోడ్డు వద్ద సోమవారం కంపెనీకి కార్మికులను తరలించే ప్రైవేటు బస్సును కారు ఢీకొంది. దీంతో ఒకరు అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల కథనం మేరకు.. శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పనిచేసే కార్మికులను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సోమవారం సాయంత్రం కొండూరులో ఉన్న హాస్టల్ వద్ద దింపింది. అనంతరం తడవైపు వెళుతుండగా పాత మాంబట్టు రోడ్డు వద్ద వెనుక వస్తున్న వాహనాన్ని గమనించకుండా డ్రైవర్ అవతలి వైపు వెళ్లేందుకు తిప్పాడు. అదే సమయంలో చెన్నై నుంచి నెల్లూరుకు వెళుతున్న ఇన్నోవా కారు వేగంగా వచ్చి బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు సీటులో కూర్చున్న వ్యక్తి ప్రమాదాన్ని చూసి షాక్‌తో అస్వస్థతకు గురయ్యాడు. 108 సిబ్బంది అతన్ని సూళ్లూరుపేట వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించండి



డక్కిలి: సంగనపల్లిలో మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి



నేదురుమల్లి రాజ్యలక్ష్మితో మాట్లాడుతున్న గ్రామస్తులు

డక్కిలి : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ సహకరించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. ఆమె సోమవారం సంగనపల్లి యల్లావజ్జలపల్లి (బ్రాహ్మణపల్లి), కమ్మపల్లి ఎస్టీ కాలనీ, వెంబులూరు పంచాయతీలోని అంబేడ్కర్ నగర్, అరుంధతీవాడలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకుని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపీపీ చెంచయ్య, నాయకులు ఎం.నారాయణరెడ్డి, వేణు నాయుడు, జీ శ్రీనివాసులు నాయుడు, ఆర్ చిరంజీవి, జానకిరామయ్య, బి.శ్రీనివాసులు, ఎం శ్రీనివాసులు, బి.భాస్కర్ నాయుడు, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన కటగుంట గ్రామస్తులు

వెంకటగిరి రూరల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మిని సోమవారం బాలాయపల్లి మండలం కడగుంట గ్రామస్తులు కలిశారు. స్థానిక సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, నేతలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి



మాట్లాడుతున్న కౌన్సిలర్ ఆరి శంకరయ్య

వెంకటగిరి(సైదాపురం) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబానికీ లబ్ధి చేకూరిందని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం సుదర్శనం నగర్‌లోని సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వెంకటగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలుపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందాం



సమావేశంలో పాల్గొన్న నేతలు, బూత్ కమిటీ సభ్యులు

సైదాపురం: జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందామని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మన్నారపు రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం చాగణం ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మండలానికి చెందిన బూత్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం – మా బూత్ సిద్ధం అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ స్థాయి కమిటీ సభ్యులు వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు సతీష్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గోగినేని శివకుమార్, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, మాజీ సర్పంచ్ బండి వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌నాయుడు, మాలకొండారెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు



కారికాడులో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



డక్కిలి: పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

దొరవారిసత్రం: దొరవారిసత్రం, తొగరాముడి పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలు వేసుకోని వారికి సోమవారం ఇంటింటికీ వెళ్లి వేశారు. డాక్టర్ నవీన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కారికాడు, వేలికాడు, నాగినేరి, మీజూరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేశారు. సూపర్‌వైజర్ జనార్ధనయ్య, సిబ్బంది విజయలక్ష్మి, నీరజ, సబిత పాల్గొన్నారు.

డక్కిలి: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమైని వైద్యాధికారి బిందు ప్రియాంక తెలిపారు. మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియోలో చుక్కలు వేసుకోని పిల్లలకు సోమవారం వేశారు. మార్లగుంట ఎస్టీ కాలనీ, మాధవయ్యపాళెం క్రాస్ రోడ్డు, వెలికల్లు మెయిన్, దళితవాడలో ఇంటింటికీ వెళ్లి పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ బిందు ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శశికళ, హెల్త్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, రూట్ సూపర్‌వైజర్ సాంబ శివరాం పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి



కార్మికులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రమణయ్య

చిల్లకూరు : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తిరుపతి జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ జే రమణయ్య ఆదేశించారు. తమ్మినపట్నం సమీపంలో ఉన్న జిందాల్ పవర్ ప్రాజెక్టు(సింహపురి యూనిట్)లో సోమవారం భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఎలా రక్షణ కల్పిస్తున్నామనే విషయాన్ని ముందుగానే తెలియజేయాలన్నారు. పరిశ్రమను యాజమాన్యం ఎంత భద్రంగా కాపాడుకుంటుందో అదే విధంగా కార్మికుడి భద్రతపైనా దృష్టి సారించాలన్నారు. అనంతరం అగ్నిమాపక యంత్రాల ద్వారా ప్రదర్శన చేసిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జేపీఎల్ ప్లాంట్ హెడ్ కే శ్రీనివాసరావు, ప్లాంట్ హెడ్ సపోర్టు మన్సూరి, హెచ్‌ఆర్ విల్సన్, ప్లాంట్ హెడ్ పుట్టి సురేస్ తదితరులు పాల్గొన్నారు.